క్లుప్తంగా

శివలింగాకృతిలో ప్రసాదం



శివలింగాకృతిలో రూపొందించిన ప్రసాదాన్ని అందజేస్తున్న నానాజీ తదితరులు

కడియం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామివారి ఆలయానికి స్థానిక శ్రీవెంకట భక్తాంజనేయ స్వీట్‌స్టాల్ యజమాని నేతి నానాజీ సోదరులు శివలింగాకృతిలో ప్రసాదాన్ని అందజేసారు. శివరాత్రి వేడుకలు ముగిసే వరకు ఆలయం వద్ద ఈ ప్రసాదాన్ని అలాగే ఉంచనున్నట్లు ఆలయ అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు గ్రంథి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



సందీప్‌శర్మను సత్కరిస్తున్న పృచ్ఛకులు

సీటీఆర్ఐ: తపస్సు, శిరస్సు, మనస్సు, ధనస్సు వంటి పదాలను ఉపయోగించి దత్తపదిలో మహాభారతార్థంలో పద్యం చెప్పమని పృచ్ఛకుడు అడగ్గా, పాశుపతాస్త్రం కోసం శివుడికి తపస్సు చేసిన అర్జునుని కథలో వీటిని జోడించి శతావధాన శరచ్చంద్ర డాక్టర్ తాతా సందీప్‌శర్మ అద్భుతంగా వర్ణించారు. అక్కడున్న విశిష్ట అతిథులను అలరించారు. ఆదివారం అష్టావధానం సాహిత్య క్రతువులో భాగంగా స్థానిక సాదుశాంతి తత్త్వర్శినీ సత్సంగంలో అష్టావధాన ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు అవధాని సందీప్ శర్మ అలవోకగా సమాధానాలు చెప్పారు. సమర్పణ వీవీ సుబ్రహ్మణ్యం చేయగా, డాక్టర్ ధూళిపాళ మహదేవమణి సంచాలనం చేశారు. వీరితో పాటు సాహితీవేత్తలు రాయప్రోలు కామేశ్వర శర్మ, వాడపల్లి అన్నపూర్ణ, ఇటికిరాల పద్మావతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అవధాని సందీప్ శర్మను సత్కరించారు.

స్వచ్ఛ భారత్ ఆద్యుడు గాడ్గే బాబా



గాడ్గే బాబా విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

కడియం: స్వచ్ఛ భారత్ పితామహుడు, వాగ్గేయకారుడు గాడ్గే బాబా అని స్థానిక నాయకులు మార్గాని సత్యనారాయణ, బీసీ రమణ కొనియాడారు. వేమగిరిలోని బుద్ధ విహార్‌లో ఆదివారం గాడ్గే బాబా జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. మహనీయుల ఆశయాల సాధన సమితి, బుద్ధవిహార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వక్తలు గాడ్గే బాబా జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు యమహోదయ, దంగేటి సత్తిబాబు, కొంకి రమేష్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, తాతబ్బాయి, సందీప్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం సిటీ: డాక్టర్ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా, రాజ్యాంగ స్ఫూర్తితో కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టినట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మహిళలు, యువత, రైతులు, పెట్టుబడులు ప్రధానాంశాలుగా బడ్జెట్‌కు రూపకల్పన చేశారని విశ్లేషించారు. ఆదివారం స్థానికంగా జరిగిన బడ్జెట్‌పై మేధావుల సమావేశంలో మాట్లాడారు. వికసిత్ భారత్ లక్ష్యంగా, రూ.50.60 లక్షల కోట్ల బడ్జెట్ ఉందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం హుకుంపేటలోని తన కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఓట్లు ఎలా వేయాలనే విషయంపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు.

ఉత్పత్తి ధరకే షేడ్‌నెట్లు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ద్వారా రైతులకు అవసరమైన పరికరాలను ఉత్పత్తి ధరలకే అందుబాటులోకి తీసుకువస్తున్నామని సంఘ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప తెలిపారు. 90 శాతం, 75 శాతం షేడ్‌నెట్లను ఉత్పత్తి ధరలకే రైతులకు అందించడాన్ని ఆదివారం అయ్యప్ప, పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. కడియపులంకలోని సంఘ కార్యాలయం వద్ద వీటిని పొందవచ్చన్నారు.

శివశివా.. అంత చిన్నచూపా..?

- కోటిలింగేశ్వరుని సాక్షిగా దళితులపై వివక్ష
- మహా శివరాత్రి ఏర్పాట్లలో స్థానికేతరులకు పెద్దపీట
- కూటమి నాయకుల పెత్తనం
- కనీసం స్థానిక నేతలనూ పిలవని వైనం
- మద్యం, ఇసుక సిండికేట్‌ను శాసిస్తున్న వ్యక్తి కీలకపాత్ర
- కలెక్టర్, ఎస్పీలకు దళిత నాయకుల ఫిర్యాదు



గోదావరి గట్టున ఉన్న కోటిలింగాల క్షేత్రం

సీటీఆర్ఐ: గిద్దెడు నీళ్లు పోస్తే పరవశించిపోతాడు పరమ శివుడు. గొప్పవాడు, పేదవాడు, లేనివాడు, ఉన్నవాడనే తేడా లేకుండా అందరినీ కరుణించే పరమ శివుడి దేవస్థానంలో దళితులను చిన్నచూపు చూస్తున్న వైనమిది. దక్షిణ కాశీగా పేరొందిన గోదావరి గట్టున ఉన్న కోటిలింగేశ్వర స్వామివారి మహా శివరాత్రి మహోత్సవాల వేళ కులాల మధ్య కూటమి పాలకులు చిచ్చుపెడుతున్నారు. ఈ కోటిలింగేశ్వర స్వామివారి క్షేత్రం అతి ప్రాచీనమైంది. ఈ ఆలయం నగరపాలక సంస్థ 41వ డివిజన్‌లోని కోటిలింగాలపేటలో ఉంది. ఇక్కడ అత్యధికంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ఆలయంలోని పరమేశ్వరుడికి శివరాత్రి రోజున వేడుకల్లో అన్ని వర్గాలు కలిసి, వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ వచ్చారు.

పాలక మండలి లేదు, ఉత్సవ కమిటీ లేదు..

గత వైఎస్సార్ సీపీ పాలనలో ఆలయానికి పాలక మండలి ఉండేది. వారి ఆధ్వర్యంలో ఆలయంలో ఏ ఉత్సవమైనా అందరూ కలిసి చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక పాలక మండలిని ఇంకా ఏర్పాటు చేయలేదు. అంతేకాకుండా శివరాత్రి పర్వదినాన ఉత్సవ కమిటీ సైతం ఏర్పాటు చేయలేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో ఉత్సవ కమిటీని వేయలేదంటున్నారు. ఇదే అదనుగా కూటమి నాయకులు కొందరు వారికి వారే శివరాత్రి ఉత్సవాలు చేయడానికి ఆలయ ఏఓ లక్ష్మీబాయితో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు. అందరినీ కలుపుకొని వెళ్లాల్సినవారు మాత్రం తమ సామాజిక వర్గానికి చెందిన వారితోనే కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చిచ్చు పెట్టే నాయకులకు కళ్లెం వేయాలి

తమ సామాజిక వర్గానికి చెందిన వారిని కనీసం పిలవకుండా పోస్టర్‌ను ఆవిష్కరించడమే కాకుండా, ఏర్పాట్లు చేయడంపై కోటిలింగాలపేట దళిత సామాజిక వర్గానికి చెందిన పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. **టీడీపీకి** చెందిన ఓ నాయకుడు లిక్కర్, **ఇసుక సిండికేట్** పెద్దగా వ్యవహరిస్తున్నాడు. అతని **అనుచరులతో** కలిసి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై **ఆవేదన** చెందిన దళిత నాయకులు కలెక్టర్ **ప్రశాంతికి, ఎస్పీ** నరసింహ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. **కులాల** మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యవహరిస్తున్న నాయకులను అదుపు చేయాలంటూ వినతిపత్రంలో కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు (ఫైల్)

లింగోద్భవ సమయంలో టికెట్ రూ.200

ఆలయ ఏఓ లక్ష్మీబాయి, కూటమి నాయకులు కలసి శివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో టికెట్ ధరను అమాంతం పెంచి, సామాన్యులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టికెట్ ధరను రూ.200కి పెంచడానికి నిర్ణయం తీసుకోవడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. పాలక మండలి లేకుండా, ఉత్సవ కమిటీ లేకుండా ఏఓ ఎలా నిర్ణయం తీసుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భగవంతుని దర్శనానికి ఇంత రేటు పెట్టడం వల్ల సామాన్యులు ఎలా దర్శించుకుంటారని నిలదీస్తున్నారు.

అంతా కలిసి వైభవంగా చేసే వాళ్లం



మా పేటలో ఎప్పుడూ కులాల మధ్య రచ్చ జరగలేదు. ఎన్నో సంవత్సరాల నుంచి మా పూర్వీకుల వద్ద నుంచి మేమందరం కలిసి స్వామివారికి సేవలు చేస్తున్నాం. అటువంటిది ఏకపక్ష నిర్ణయాల వల్ల అనేక ఇబ్బందుల వస్తున్నాయి. కనీసం మా సామాజికవర్గం నుంచి ఒక్కరిని కూడా పిలవలేదు. గతంలో బ్రాహ్మణులు, రజకులు, కాపులు, ఎస్సీలు అందరం కలిసి శివరాత్రిని ఘనంగా నిర్వహించే వాళ్లం.

– వల్లూరి రాజ్‌కుమార్, స్థానికుడు

కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాం. కులాల మధ్య చిచ్చు పెట్టేలా కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశాం. మేము ఫిర్యాదు చేసిన తరువాత వారికి కావాల్సిన దళితులిద్దరితో పోస్టర్ ఆవిష్కరించినట్లు ఫొటో తీశారు. దేవుని సేవకి మాకు కూడా అవకాశం కల్పించాలని అధికారులను కోరాం.

– ఎస్.శ్రవణ్ కుమార్, స్థానికుడు

యువతి అదృశ్యం



లోలుగు వినీల(ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని కవలగొయ్యి గ్రామానికి చెందిన లోలుగు పాపారావు ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, కవలగొయ్యి గ్రామానికి చెందిన 19 ఏళ్ల వినీల శనివారం ఉదయం స్కూటీపై మేనత్తను, చెల్లిని ఎస్‌వీ జనరల్ మార్కెట్‌కు తీసుకువెళ్లింది. అక్కడి నుంచి వినీల బ్యాంక్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. స్కూటీని అక్కడ పార్కింగ్ చేసి, తాళాలు డిక్కీలో వేసి వెళ్లింది. ఆమె ఫోన్ చేసినప్పటికీ, ఇక తాను రానని చెప్పినట్లు ఆమె తండ్రి పాపారావు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బొమ్మూరు ఏఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటనగరం వీఆర్వో మృతి



మురళీకృష్ణ(ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం వీఆర్వో గునపాటి మురళీకృష్ణ(49) ఆదివారం అనారోగ్యంతో రాజమండ్రిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించారు. ఆయన స్వగ్రామం ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామం. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. తహసీల్దార్ సూర్యకుమార్, వీఆర్‌వోలు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో శర్మ, ప్రసాద్ తదితరులు

మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసానికి స్కౌట్స్ శిక్షణ

స్కౌట్ అండ్ గైడ్స్ ప్రతినిధి శర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్కౌట్ శిక్షణతో తరగతి గదిలో పొందే జ్ఞానం కంటే, అత్యధిక మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని స్కౌట్ అండ్ గైడ్స్ నేషనల్ హెడ్‌క్వార్టర్స్ ప్రతినిధి డీఆర్‌కే శర్మ తెలిపారు. ఆదివారం స్థానిక రైల్వే క్వార్టర్స్ ఆవరణలో దక్షిణమధ్య రైల్వే భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజరాజనరేంద్ర అండ్ గోదావరి ఓపెన్ గ్రూప్ ఆధ్వర్యంలో వరల్డ్ థింకింగ్ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. సీనియర్ స్కౌట్ మాస్టర్ సుబ్బరాయశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా స్కౌట్ పతాకాన్ని విద్యార్థులు ఆవిష్కరించారు. నేషనల్ హెడ్ క్వార్టర్స్ ప్రతినిధి శర్మ, ప్రాంతీయ అసిస్టెంట్ అడ్మిన్ కమిషనర్ దాడి ప్రసాద్ మాట్లాడుతూ, పిల్లలు స్కౌట్స్‌లో శిక్షణ పొందడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జీఆర్‌పీఎఫ్ ఎస్సై పెద్దిరాజు మాట్లాడుతూ, పిల్లల్లో మంచి నడవడిక ఉండాలంటే స్కౌట్స్ శిక్షణ అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సంహిత డిగ్రీ కళాశాల విద్యార్థులు స్కౌట్ ఉద్యమంలో పాల్గొన్నారు. సారస్కృతిక కార్యక్రమాల అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సీనియర్ లీడర్స్ ఎస్‌వీ భద్రరావు, ఎస్ఆర్‌వీ బ్రహ్మేశ్వరరావు, కృష్ణకుమార్, యోగా శిక్షకులు కేఎస్‌వీ శ్రీనాథ్‌రెడ్డి, సీనియర్ స్కౌట్ మాస్టర్ మోహనదుర్గాప్రసాద్ ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రేంజర్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



యోగాసనం వేస్తున్న విద్యార్థులు

నిరాశ్రయులపై చులకన భావం తగదు

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక, పట్టణాలపై మోజుతో అసంఘటిత కార్మికులు నిరాశ్రయులుగా మారుతున్నారని షెల్టర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జి.రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. నిరాశ్రయులను పరాన్నజీవులని ప్రస్తావించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయ్ వ్యాఖ్యలు సరికాదని అభ్యంతరం తెలిపారు. ఆదివారం స్థానిక లాలాచెరువు సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి నిరాశ్రయులతో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరాశ్రయిలను గౌరవప్రదమైన పౌరులుగా జీవించడానికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రాంబాబు కోరారు. నిరాశ్రయుల సమస్యలపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అందుకే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం దేశ పౌరులందరికీ తినడానికి తిండి, నివాసయోగ్యమైన గృహం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. స్వల్ప కారణాల వల్ల పౌరులు నిరాశ్రయులుగా మారడాన్ని ప్రభుత్వం అధ్యయనం చేసి, వారిపై సానుకూల భావం, సానుభూతి వ్యక్తం చేయలే కానీ పరుష పదజాలంతో దూషించడం సరైన విధానం కాదన్నారు. నిరాశ్రయుల హక్కుల కోసం తమ సంస్థ ద్వారా చురుగ్గా పనిచేస్తామని, వారి సమస్యలు ప్రభుత్వ దృష్టికి, అత్యున్నత న్యాయస్థానాల దృష్టికి తీసుకువెళతామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, దివ్య, కొండలరావు, నిరాశ్రయులు, వృద్ధులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న రాంబాబు తదితరులు

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌గోపాల్

రాజమహేంద్రవరం సిటీ: గౌడ సామాజిక వర్గీయులంతా ఐకంగా హక్కులను సాధించుకోవాలని గౌడ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ సంఘ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గౌడ వర్గీయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా మార్గాని సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా మన్నెం సన్నిబాబు, ఉపాధ్యక్షుడిగా మార్గాని ఆదినారాయణ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

కడియం: మండలంలోని శివాలయాల్లో శివరాత్రి పర్వదినానికి సర్వం సిద్ధం చేశారు. బుధవారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి ఆలయాల్లో కల్యాణం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభించనున్నారు. మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వర స్వామి, వేమగిరి శివాలయం, జేగురుపాడు నగరేశ్వర స్వామి, దుళ్లలోని బాలాత్రిపురసుందరీ సమేత అగస్త్యేశ్వరాలయం, మురమండలోని సోమేశ్వరాలయం, వీరవరం శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయని దేవదాయ శాఖ వర్గాలు, ఆలయ భక్త బృందాలు తెలిపాయి. ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు. దుళ్లలో సోమవారం స్వామివారి కల్యాణం, 26న ప్రత్యేక పూజలు, అన్న సమారాధన, 28న త్రిశూలస్నానం, పుష్పయాగాలు జరుగుతాయి. కడియపులంక శివాలయంలో శివరాత్రి రోజు తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, రాత్రి ఏడు గంటలకు స్వామి శాంతి కల్యాణం, గ్రామోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకాలుంటాయి. కడియంలోని మల్లేశ్వరాలయంలో సోమవారం స్వామివారి సదస్యం, చతుర్వేద స్వస్తి, 26న తెల్లవారుఝామున ప్రత్యేక అభిషేకాలు, రథోత్సవం, 27న రాత్రి మహాజ్యోతిర్లింగార్చన ఉంటాయి.

హరిహర మహా క్షేత్రంలో..

కడియపులంకలో పవిత్ర గోదావరి నదీ తీరంలో వెలసిన హరిహర మహాక్షేత్రంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద విశేష ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. క్షేత్రంలో అపర్ణాసమేత అనంతేశ్వర స్వామివారికి తెల్లవారుజామున మూడు గంటల నుంచి పంచామృతాభిషేకాలు, అనంతరం దర్శనం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు, రాత్రి ఏడు గంటలకు శివపార్వతుల శాంతి కల్యాణం, రాత్రి 9 గంటలకు గ్రామోత్సవం, 12 గంటలకు స్వామివారి లింగోద్భవ అభిషేకాలు జరుగుతాయని వివరించారు.



కడియపులంకలోని అనంతేశ్వర స్వామి

నేటి నుంచి ఆంజనేయస్వామి వార్షికోత్సవాలు

కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయ స్వామివారి 75వ వార్షికోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆంజనేయ మాలలు 170 మందికి పైగా ధరించారన్నారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో భక్తులు, దాతల సహకారంతో సోమవారం 108 కలశాలతో మంత్రపూరిత సప్తనదీ జలాలతో సంప్రోక్షణ చేపడతారన్నారు. 25న అఖండ దీపారాధన, అష్టదిక్పాలక పూజ, ధ్వజారోహణం ఉంటుందన్నారు. బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. 26న మహా శివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారుజామున 3 నుంచి స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం మహాన్న సమారాధనకు ఏర్పాట్లు చేశామన్నారు. అదే రోజు బాలోత్సవం, తులాభారం, భజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 27న లక్ష చామంతి పూజ, 28న సహస్రాధిక దీపాలంకరణ, అఖండ హారతులు, మార్చి 1న స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ఆవుపాలతో అభిషేకం, సాయంత్రం 6 గంటలకు సువర్చల సహిత ఆంజనేయ స్వామివారి శాంతి కల్యాణం, 2న ఇరుముడి కట్టుట, ముడుపుల సమర్పణ, హోమాలు, పూర్ణాహుతి, దీక్షా విరమణలు ఉంటాయన్నారు.



అపర్ణాదేవి

హరహర మహాదేవ

- కోరిన కోర్కెలు తీర్చే ధవళగిరి అగస్త్యేశ్వరుడు
- శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ధవళేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ధవళేశ్వరం అగస్త్యేశ్వర స్వామివారు భక్తుల పూజలందుకుంటున్నారు. పురాణ చరిత్ర కలిగిన అగస్త్యేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు మహా శివరాత్రి పర్వదినాన వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. బుధవారం మహా శివరాత్రి సందర్భంగా ధవళేశ్వరం అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ధవళేశ్వరంలో కొలువై ఉన్న బాలత్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి త్రేతాయుగం నుంచి మహర్షులు, దేవతలతో పూజించబడినట్లు పురాణాలు చెబుతున్నాయి.

అగస్త్య మహర్షి ఇల్వలుడిని బ్రహ్మాస్త్రంతో సంహరించిన అనంతరం బ్రహ్మ హత్యా దోషం పోగొట్టుకునేందుకు అఖండ గౌతమి ఆఖరైన ధవళేశ్వరం వద్దకు వచ్చారు. అక్కడ జ్యోతిర్లింగ రూపంలో స్వయంభూ లింగం కనిపిస్తుంది. అగస్త్య మహాముని స్వయంభూ లింగాన్ని పూజించి బ్రహ్మ హత్యా దోషాన్ని తొలగించుకుంటారు. తొలిసారి అగస్త్య మహాముని పూజలు అందుకోవడంతో స్వామివారికి అగస్త్యేశ్వర స్వామిగా పేరు వచ్చింది. త్రేతాయుగంలో శ్రీరామ చంద్రమూర్తి అరణ్యవాసం చేస్తూ స్వామివారిని దర్శించుకొని పూజలు చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి.

కార్యక్రమాలివీ..

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు ఎస్‌వీజీ నరసింహమూర్తి(విస్సు) తెలిపారు. బుధవారం ఉదయం సుప్రభాత సేవ, దర్శనం, అభిషేకాల అనంతరం సంధ్యార్చాన దర్శనాలు, ధూప సేవ, ప్రాకార సేవ, నంది వాహన గ్రామోత్సవం, అనంతరం లింగోద్భవ ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. అమ్మవారికి లలిత సహస్ర నామార్చన నిర్వహిస్తామని తెలిపారు.



అగస్త్యేశ్వర స్వామి

విస్తృత ఏర్పాట్లు

మహా శివరాత్రి పర్వదినానికి ధవళేశ్వరంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రామపాదాల రేవు వద్ద తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై పంచాయతీ, దేవస్థానం అధికారులు దృష్టి సారించారు.

నిత్యం భగవన్నామ స్మరణ చేయాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భగవంతుని పేర్లు పిల్లలకు పెట్టుకోవడంలో ఆంతర్యం నిత్యం భగవన్నామస్మరణ చేయడమేనని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు కల్యాకులను శ్రీరామచంద్రమూర్తి అన్నారు. సనాతన ధర్మ వారిధి ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమాజంలో వెయ్యి మందితో విష్ణు సహస్ర, లలితా సహస్ర నామ పారాయణం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సంధానకర్త మిర్తిపాటి వెంకట రామయ్య, అనుసంధాన కర్త చెన్నపాటి రామకృష్ణ, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్, నగర అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ పర్యవేక్షించారు.



కల్వకులను దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

26న మహాన్న సమారాధన

రాజమహేంద్రవరం రూరల్: మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న మోరంపూడి జంక్షన్‌లోని సీవీరావు గార్డెన్స్‌లో 30వ మహాన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు శ్రీసాయి భక్తాంజనేయ తాపేశ్వరం స్వీట్స్ అధినేత వలవల చక్రపాణి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శివపార్వతుల కల్యాణం, స్వామివారికి కుంభమేళా గంగా జలం, 108 కలశాలతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 నుంచి హారతులు, రాత్రి కోలాటం, భజన, గురుతత్వంపై ఉపన్యాసం ఉంటుందన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో తడి-పొడి చెత్త సేకరణపై హుకుంపేట గ్రామంలో రాజమండ్రి డీఎల్పీఓ ఎం.నాగలత అవగాహన కల్పించారు. ఆదివారం ఆమె, ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కాతేరు, తొర్రేడు, వెంకటనగరం, శాటిలైట్‌సిటీ, పిడింగొయ్యి, ధవళేశ్వరం, కొంతమూరు, బొమ్మూరు, రాజవోలుల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న డీఎల్పీఓ



గోదావరి ఘాట్‌లో వ్యర్థాలను తొలగించిన వలంటీర్లు

గోదావరి ఘాట్ల పరిశుభ్రత

కంబాలచెరువు: మహా శివరాత్రిని పురస్కరించుకుని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు మూడు ఘాట్లు శుభ్రం చేశారు. శనివారం 50 మంది త్యాగరాజ గాన సభ సమీపంలోని దోభీ ఘాట్లో వ్యర్థాలను తొలగించారు. భక్తుల పుణ్యస్నానాల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వలంటీర్లను పలువురు ప్రముఖులు అభినందించారు.